క్లుప్తంగా

'న్యాయం చేయండి'

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలంలోని కొంపల్లి శివారులో 75 సర్వేనంబర్‌లో మూడెకరాల భూమిని కొనుగోలు చేసుకొని సాగు చేస్తున్నట్లు పుల్లూరు రామయ్యపల్లెకు చెందిన అజ్మీరా జ్యోతి,రమేష్ దంపతులు తెలిపారు. కాగా కొంపెల్లి తండాకు చెందిన వాలునాయక్ అనే వ్యక్తి ఆ భూమి తనదే అని అక్రమించుకుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నాడని ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్, జ్యోతి దంపతులు మాట్లాడారు. సదరు వ్యక్తి నుంచి తమ భూమిని కాపాడి న్యాయం చేయాలని వారు అధికారులకు వేడుకున్నారు.

నేడు అవగాహన

మొగుళ్లపల్లి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నేడు (గురువారం) మొగుళ్లపల్లి గ్రామస్తులకు సీసీ కెమెరాల పనితీరుపై అవగాహన కల్పించనున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.పెద్దలు, రైతులు, ఫర్టిలైజర్, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాలు, ఆటో యూనియన్, ఇతర వ్యాపారస్తులు ప్రజలు, గ్రామ యూత్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మొగుళ్లపల్లి : మండలంలోని వేములపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. వేములపల్లి శివారులో బుధవారం పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో నంబర్ ప్లేట్ లేని రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తు డ్రైవర్లు పారిపోయారు. అనంతరం వీరు వరికోలు గ్రామానికి చెందిన గడ్డం కిరణ్, వీరన్నగా తెలిందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తే ఎవరిని ఉపేక్షించేంది లేదని తెలిపారు.

నియామకం



చిట్యాల : గ్రామ పంచాయతీ కారోబార్‌ల సంఘం మండల ఇన్‌చార్జ్‌గా లక్ష్మీపూర్ తండాకు చెందిన బానోత్ రాకేశ్‌ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర జీపీ కారోబార్‌ల సంఘం అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాకేశ్‌కు నియామాక పత్రం అందజేశారు.

డీపీఓకు సన్మానం



ములుగు : జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దేవరాజును ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు అరవింద్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు సన్మానించారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో డీపీఓను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ములుగు మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల సాగర్, మరాటి రవీందర్, లింగస్వామి, రామచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



రాకేశ్(ఫైల్)

మంగపేట : మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన ఊడుగుల రాకేశ్ (20) ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. మృతుడి తాత ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాంబాబు మృతి పార్టీకి తీరని లోటు



ఏటూరునాగారం : మండలంలోని శివాపురం పంచాయతీ పరిధి గోగుపల్లికి చెందిన బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు, మాజీ సర్పంచ్ యాలం రాంబాబు బుధవారం మృతి చెందారు. ఈమేరకు రాంబాబు మృతదేహానికి జెడ్పీ మాజీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతనం ఆమె మాట్లాడుతూ..రాంబాబు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని ఆమె అన్నారు. మలిదశ ఉద్యమంలో రాంబాబు కీలక పాత్ర పోషించారన్నారు.

ప్రతిభను వెలికితీయడానికే క్రీడలు



కాటారం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై అభినవ్

కాటారం : గ్రామీణ విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడానికి క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడుతాయని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సిరంగి రమేశ్, ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ఆవరణలో బుధవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్-14,17 విభాగంలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలిబాల్ విభాగాల్లో పోటీలు నిర్వహించగా పలు జట్లు ఉత్తమ ప్రతిభ కనబర్చాయి. ఆయా విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన జట్లకు స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దేవానాయక్, ప్రిన్సిపాల్ లాలు, ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ విజయలక్ష్మి, పీడీ, పీఈటీలు మంథెన శ్రీనివాస్, మహేందర్, సరస్వతి, పూర్ణిమ, సరిత, రాజేశ్వరి, కోచ్ వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

21న మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

చిట్యాల : మండల స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడలు 21న ప్రారంభం కానున్నట్లు ఎస్‌జీఎఫ్ చైర్మన్ మండల విద్యాధికారి కొడెపాక రఘుపతి బుధవారం తెలిపారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో అండర్-14,17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ఎంపికలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు, సోషల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు బోనఫైడ్ సర్టిఫికెట్‌తో క్రీడలలో పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 94940 40082 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఎస్‌జీఎఫ్ కన్వీనర్ పీడీ టి.స్వరూప రాణి ఉన్నారు.

నీరున్నా.. నిరాశే

- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు



ఎండుతున్న పొలాన్ని చూపుతున్న రైతులు

మల్హర్ : ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉన్న చివరి అయకట్టు వరకు మాత్రం సాగునీరు చుక్క అందడం లేదు. దీంతో పొలాలు ఎండుతున్నాయి. మండలంలోని ఎడ్లపల్లి శివారులోని బొగ్గుల వాగు ప్రాజెక్టులో ఇటీవల కురిసిన వర్షాలతో భారీగా నీరు చేరి నిండుకుండాల దర్శనమిస్తోంది. ప్రాజెక్టు కింద సుమారు 5,100 ఎకరాలకు సాగునీరు అందుతోంది. కాగా గత కొన్నేళ్లుగా ప్రాజెక్టు కాల్వలకు మరమ్మతులు చేపట్టక పోవడంతో మండలంలోని వల్లెకుంట, కొయ్యూరు శివారులోని 50 ఎకరాల్లో పంట పొలాలకు సక్రమంగా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు రాజయ్య, రమేశ్, సోమరాజు, పోచయ్య, స్వామి, రమేశ్, సంపత్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బొగ్గుల వాగు ప్రాజెక్టు కాలువలు అక్కడక్కడ శిథిలావస్థకు చేరుకోవడంతో పొలాలకు సక్రమంగా నీరు అందడం లేదని వాపోయారు. గత కొన్నేళ్లుగా కాల్వల మరమ్మతులపై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నీరు రాక తమ పొలాలు ఎండిపోయి పెట్టిన పెట్టుబడి సైతం రాక నష్ట పోతామని తెలియజేస్తున్నారు. అధికారులు స్పందించి కాల్వలకు మరమ్మతులు చేపట్టి చివరి ఆయకట్టు పొలాలు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

రాజకీయ పార్టీలతో నేడు సమావేశం

మొగుళ్లపల్లి : మండలంలోని 26 గ్రామ పంచాయతీలలో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించామని ఎంపీడీఓ మహబూబ్ హుస్సేన్ తెలిపారు.దీనిపై నేడు (గురువారం) మండల పరిషత్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసినట్లు బుధవారం ఆయన ప్రకటనలో తెలిపారు. సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

కాళేశ్వరం : ఎన్నికల జాబితాలో అభ్యంతరాలపై నేడు(గురువారం) ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. కాగా, ఇప్పటికే మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ముసాయిదా ఓటరు జాబితాను ప్రదర్శించినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న నిశిధర్‌రెడ్డి

చిట్యాల : మండల కేంద్రానికి చెందిన తూటిచర్ల నర్సయ్య, ఒడితల గ్రామానికి చెందిన కోడూరి రాజసమ్మయ్య, గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రబోయిన సతీష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతల నిశిధర్‌రెడ్డి బుధవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ తదితరులు ఉన్నారు. అలాగే ఎర్రబోయిన సతీష్, జడలపేట గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి పరామర్శించి ఓదార్చారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మల్హర్: సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

- టీఆర్‌టీఎఫ్ సభ్యత్వ నమోదు

మల్హర్ : మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో బుధవారం టీఆర్‌టీఎఫ్ (తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పెండెం మధుసూదన్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, దసరా కానుకగా పీఆర్‌సీని ప్రకటించాలన్నారు. అలాగే జీఓ 371 బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికుల నియామకానికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, ప్రజా ప్రభుత్వం అనే పేరు నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కూచనపల్లి రవీందర్, రాష్ట్ర కార్యదర్శి నలుమాసుల రఘుకుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నామని శంకర్, మండల బాధ్యులు బోయిని సతీష్, గొర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల: సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

చిట్యాల : ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ములకల్ల తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం గోపాలపూర్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఐదు డీఏలను విడుదల చేసి పెండింగ్ బిల్లులను ఏకకాలంలో చెల్లించాలని, పీఆర్‌సీని ప్రకటించాలని అన్నారు. అలాగే ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. జీపీఎఫ్ బిల్లులు, మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటరామిరెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడు మారబోయిన మహేందర్, మండల శాఖ అధ్యక్షుడు కానుగుల రఘుపతి, నాయకులు ఏదుల మనోహర్, ప్రవీణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



డీటీఎఫ్ సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

టేకుమట్ల : సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వీరేశం అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని రాఘవరెడ్డిపేట ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ మండల బాధ్యులు రమేశ్ ఆధ్వర్యంలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు పెండింగ్ డీఏ కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వంలో జరిగిన అన్యాయం, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చేయకూడదని అన్నారు. అలాగే విద్యారంగ సమస్యలతో పాటు, పెండింగ్ సమస్యల సాధనకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం తాత్కాలిక ప్రతిపాదికన విద్యావలంటీర్లను నియమించి ఉపాధ్యాయ ఖాళీ సమస్యలను తొలగిస్తే విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించిన వారు అవుతారని అన్నారు. అన్ని పాఠశాలల్లో మౌళిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ బాధ్యులు పహీం మోహిన్, తదితరులు ఉన్నారు.

దుబ్యాలలో కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

టేకుమట్ల : మండలంలోని దుబ్యాలలో జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ భూపాలపల్లి జిల్లా, లయన్స్ క్లబ్ పరకాల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరంతో పాటు అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురికి కంటి పరీక్షలు చేసి, మందుల అందజేశారు. అలాగే ఆపరేషన్ అవసరమున్న వారికి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అనంతరం జేసీఐ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజు ఆరుముళ్ల మాట్లాడుతూ అవయవ దానం వల్ల ఎంతో మందికి ప్రాణం పోసిన వారమౌతామని అన్నారు. మరణాంతరం మట్టిలో అవయవాలు కలిసి పోకుండా ఎంతో మందికి జీవం పోయాలన్నారు. నేత్రదానం వల్ల చూపులేని సుమారు 15లక్షల మంది ఉన్నారని, అందులో సుమారు 60శాతం 12ఏళ్ల లోపు పిల్లలే ఉన్నారన్నారు. అవయవదానం మరో జన్మ అని, అందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పరకాల అధ్యక్షుడు గుంటోజు వెంకన్న, ఎంజేఎస్ అధ్యక్షుడు జగన్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సంగి రవి, మాజీ సర్పంచ్‌లు ఉమేందర్‌రావు, సంపత్‌రావు, స్వేరో మండల అధ్యక్షుడు సంగి రవి, సునీల్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మేదరులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి



సమ్మేళనంలో పాల్గొన్న మేదరి సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్ : సంక్షేమ పథకాల్లో మేదరి కులస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మేదరి సంఘం జిల్లా అధ్యక్షుడు గైని రమేష్, ప్రధాన కార్యదర్శి పెద్ది పృథ్వీ అన్నారు. ప్రపంచ వెదురు బొంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో మేదరి కులస్తులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెదురు కులవృత్తిపై ఆధారపడి జీవించే మేదరిలు చాలా మంది ఉన్నారని, వారి జీవితాలు దుర్భర స్థితిలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం గుర్తించి వారికి చేయూతనివ్వాలని కోరారు.అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని సమీప అడవుల్లో వెదురును అధికంగా పెంచేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలన్నారు. సమ్మేళనంలో మేదరి సంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సన్మానం

హన్మకొండ: ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని బుధవారం కలిసి వెదురు మొక్క అందించి శాలువా కప్పి మేదరి సంఘం నాయకులు సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని స్వగృహంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావును కలిసి వెదురు ఉత్పత్తిని అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు కోరుట్ల రమేష్, కూచనపెల్లి దేవేందర్, వలిపిరెడ్డి శ్రీనివాస్, బొమ్మిడి రమేష్, చిలివేరు రవికుమార్, దీకొండ శివ పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



పోషకాహార పదార్థాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కాటారం: గర్భిణులు, బాలింతలు స్థానికంగా లభించే పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీణ తెలిపారు. మండలంలోని రేగులగూడెం, దేవరాంపల్లి, బూడిదపల్లి, దామెరకుంట అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం పోషణమాసం నిర్వహించారు. పోషకాహార పదార్థాలు, రక్తహీనత నివారణ తదితర అంశాలపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పోషకాలతో కూడిన పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఆకుకూరలు, పప్పుదినుసులు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు కమలాదేవి, అన్నపూర్ణ, ప్రమీల, సుజాత, వసుమతి, త్రివేణి, జయలక్ష్మి, కౌసల్య, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఘన సన్మానం



రఘును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

టేకుమట్ల : జాతీయ స్థాయి త్రో బాల్‌కు ఎంపికైన మండలంలోని అంకుషాపూర్ గ్రామానికి చెందిన క్రీడాకారుడు సాద రఘును బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సంగి రవి శాలువాతో సన్మానించి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి త్రో బాల్‌లో నైపుణ్యాన్ని ప్రదర్శించి జార్ఖండ్‌లోని రాంచీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని తెలిపారు. కాగా ఇద్దరిలో టేకుమట్ల మండలానికి చెందిన రఘు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకురావాలని వారు కోరారు. అలాగే రఘు ప్రయాణ ఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. ఎలవేని రాజేందర్, మాదం కొమురయ్య, కొయ్యల చిరంజీవి, హెడ్ కానిస్టేబుల్ బెల్లంకొండ వెంకటేశ్వర్‌రావు, కసుమరుగుల సంపత్, తదితరులు ఉన్నారు. అనంతరం జాతీయస్థాయి క్రీడలకు వెళ్లేందుకు సహకరించిన వారికి రఘు కృతజ్ఞతలు తెలిపారు.

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



భూపాలపల్లి రూరల్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



టేకుమట్ల: కేంద్ర మంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- బీజేపీ నాయకుల దిష్టిబొమ్మ దహనం

భూపాలపల్లి రూరల్ : లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకుడు తన్వీందర్ సింగ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద తన్వీందర్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్ మాట్లాడుతూ..ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఢిల్లీ బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తన్వీందర్ సింగ్ చేసిన వివాదస్పద వ్యాఖ్యలు సరికాదన్నారు. ప్రధాన మంత్రి మోదీ, హోం శాఖ మంత్రి అమితాషా వెంటనే స్పందించి తన్వీందర్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్, చల్లూరి సమ్మయ్య, బుర్ర కొమురయ్య, సాంబమూర్తి, మహేష్ రెడ్డి, కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, కంచర్ల సదానందం, రమణా చారి, హఫీజ్, భూమయ్య, లక్ష్మారెడ్డి, సమ్మయ్య, కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని, ఇందుకు నిరసనగా బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నేతల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కేంద్ర మంత్రులు వివాదస్పద వ్యాఖ్యలు చేయడం వివాదాలకు తెర తీయడమే అని అన్నారు. రాహుల్ గాంధీ టెర్రరిస్టు అని ఒకరు, నాలుక కట్ చేసి తీసుకువస్తే రివార్డు అంటూ మరొకరు హింసను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా తీవ్ర వ్యాఖ్యలు చేసిన మంత్రులు వెంటనే రాహుల్ గాంధీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు మాదం కొమురయ్య, వీవర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు సంపత్, కత్తి సంపత్, క్రాంతి, రఘోత్తంరెడ్డి, కొయ్యల చిరంజీవి, వంగ నరేష్, తిరుపతి, ప్రకాశ్, అల్లం ఓదెలు, యశ్వంత్, అనిల్, రమేష్, రాజు, విఘ్నేష్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి



గోవిందరావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో ఎంపీడీఓ జవహర్ రెడ్డి, ఎంపీఓ శరత్ బుధవారం పాల్గొన్నారు. పస్రా పంచాయతీలోని సెయింట్ మేరీ స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాన్ని ఎంపీడీఓ నిర్వహించారు. కార్యక్రమంలో భాగాంగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం లక్ష్మీపురం గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తడి,పొడి చెత్తపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొట్లగూడెం గ్రామ పంచాయతీ పరిధి ప్రాజెక్ట్ నగర్‌లో ప్లాస్టిక్ వాడొద్దని గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను వాడకూడదని అన్నారు.